

పాత వేతనమే..

మినీ అంగన్‌వాడీలలోని టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేసినా పాత వేతనమే అందిస్తున్నారు.

- 8లో ►



కూలీల సంఖ్య పెంచాలి

ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని కామారెడ్డి ఎంపీడీవో ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

- 9లో ►

గరిష్టం/కనిష్టం 40.2 /21.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత కాస్త తగ్గుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపటి వరకు రేషన్ బియ్యం పంపిణీ



కామారెడ్డి రూరల్: మే నెలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ శుక్రవారం వరకు కొనసాగనుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సెలవులు వచ్చినందున రేషన్ పంపిణీ పూర్తి స్థాయిలో జరగలేదు. ఈ విషయాన్ని రేషన్ డీలర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా.. పంపిణీని రెండు రోజులు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉపాధ్యాయురాలికి తుది షోకాజ్ నోటీస్ జారీ

కామారెడ్డి టౌన్: విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విదేశాలకు వెళ్లిన బీబీపేట మండలం శివరాంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీరంగం సుహాసినికి తుది షోకాజ్ నోటీస్ జారీ అయ్యింది. ఈ విషయాన్ని డీఈవో రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరంగం సుహాసిని 2021 అక్టోబర్ నుంచి 2023 జూలై వరకే అనుమతి తీసుకున్నారని పేర్కొన్నారు. జూలైనుంచి విధులలో చేరాల్సి ఉన్నా.. ఇప్పటివరకు చేరకపోవడంతో చట్టపరమైన చర్యల కోసం తుది షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి

బాన్సువాడ రూరల్: డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 20 నుంచి 30వ తేదీలోపు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని పట్టణంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ సూచించారు. రాష్ట్రంలో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) షెడ్యూల్‌లో ఉన్నత విద్యామండలి మార్పులు చేసిందన్నారు. ముందుగా ప్రకటించన ప్రకారం బుధవారం నుంచే వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంది. అయితే విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల నుంచి వినతులు రావడంతో షెడ్యూల్‌లో సవరణలు చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

మెప్మా ఆర్పీ రాజీనామా



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌కు చెందిన మెప్మా ఆర్పీ గంగామణి తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈనెల 13న పట్టణంలోని బాలుర పాఠశాలలోని బూత్ నంబర్ 54లో విధులు నిర్వహించారు. ఈ సమయంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి వచ్చి తన పై ఆగ్రహం వ్యక్తం చేశారని, కించపరిచేలా మాట్లాడారని.. అందుకే ఆర్పీ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రాజుకు రాజీనామా లేఖను అందజేశారు. అందరి ముందు తనతో దురుసుగా ప్రవర్తించి బయటకు పంపడంతో అవమానకరంగా భావించి తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

వైద్యాధికారి వికృత చేష్టలు!

- వేధింపుల తీరును ఏకరువు పెట్టిన మహిళా వైద్యులు
- అవాక్కయిన విచారణ అధికారి
- ఆగ్రహం వ్యక్తం చేసిన కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్
- నిందితుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



వైద్యశాఖలో అవినీతిపై సాక్ష్యాలు ఉన్నాయని ఫైళ్లను చూపుతున్న ఎమ్మెల్యే కేవీఆర్



డీఎంహెచ్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్, పక్కన విచారణ అధికారి అమర్‌సింగ్

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్: జిల్లాలోని పీహెచ్‌సీలలో పనిచేస్తున్న మహిళా వైద్యులపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కామారెడ్డి డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌పై బుధవారం విచారణ జరిగింది. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ విచారణ అధికారిగా హాజరయ్యారు. వేధింపులకు గురైన మహిళా వైద్యులతో మాట్లాడి వివరాలను రికార్డు చేసుకున్నారు.

కామారెడ్డి డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ లైంగికంగా వేధిస్తున్నట్లు ఇటీవల జిల్లాలోని పీహెచ్‌సీల మహిళా మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్యశాఖ ఆదేశాల మేరకు బుధవారం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ కామారెడ్డికి వచ్చారు. కలెక్టరేట్‌లోని డిప్యూటీ డీఎంహెచ్‌వో చాంబర్‌లో విచారణ జరిగింది. విచారణ జరుగుతుండగా కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి కార్యాలయానికి వచ్చి, ఏడీతో మాట్లాడారు. డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ నాయక్ ఓ మెడికల్ ఆఫీసర్‌ను లైంగికంగా వేధించినట్లు వాట్సాప్ చాటింగ్ సాక్ష్యాలతో ఫిర్యాదు వచ్చిందని, ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోలేదని డీఎంహెచ్‌వోను ఎమ్మెల్యే ప్రశ్నించారు. సదరు సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డిప్యుటేషన్‌లను ప్రభుత్వం రద్దు చేసినా ఎమర్జెన్సీ పేరిట అక్రమ డిప్యుటేషన్‌లు ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేశారు. అక్రమ డిప్యుటేషన్‌లతోపాటు కాంట్రాక్ట్ వైద్య పోస్టుల భర్తీలో డబ్బులు వసూలు చేశారని తన వద్ద సాక్ష్యాలు ఉన్నాయన్నారు. వైద్య శాఖపై త్వరలోనే సమీక్షించనున్నట్లు తెలిపారు.

రెండు గంటలపాటు విచారణ..

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌పై సుమారు రెండు గంటలపాటు విచారణ జరిగింది. విచారణ అధికారులుగా మహిళలు వస్తే బాగుండేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎవరికీ భయపడకుండా ఏం జరిగిందో ధైర్యంగా చెప్పాలని వైద్యులను కోరారు. దీంతో వారు డీఎంహెచ్‌వో వేధింపులను వివరించారు. ఈనెల 8వ తేదీన జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో మహిళా వైద్యులతో అసభ్యంగా మాట్లాడాడని, పక్కన కూర్చోవాలని చెబుతూ ఫైళ్లు ఇచ్చే క్రమంలో వికృత చేష్టలకు పాల్పడతాడని ఆరోపించారు. ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడతాడని వివరించారు. డీఎంహెచ్‌వో వేధింపుల గురించి తెలుసుకున్న విచారణ అధికారి ఏడీ అమర్‌సింగ్ నాయక్, ఎమ్మెల్యే కేవీఆర్ అవాక్కయ్యారు. డీఎంహెచ్‌వోపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూతుళ్ల వయసున్న వైద్యులతో ఇలా ప్రవర్తించడం సిగ్గు చేటన్నారు. ఇలాంటి చేష్టలను ఉపేక్షించేది లేదన్నారు. విచారణ సమయంలో వైద్యులు తెలిపిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని విచారణ అధికారికి సూచించారు. తప్పుడు నివేదికలు ఇస్తే జూన్ 7 వ తేదీ తర్వాత వైద్యులతో కలిసి ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు. అన్ని వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందిస్తానని విచారణ అధికారి అమర్ సింగ్ తెలిపారు. కాగా తాను ఎలాంటి తప్పు చేయలేదని డీఎంహెచ్‌వో పేర్కొనడం గమనార్హం.

పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు

కామారెడ్డి టౌన్: డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌తో పాటు కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనునాయక్‌పై పలు సెక్షన్‌ల కింద కామారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారని పీహెచ్‌సీల మహిళా వైద్యాధికారులు దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ అనంతరం సెక్షన్ 354, 354(డి), 509 ల కింద డీఎంహెచ్‌వోపై కేసులను నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. అంతే కాకుండా ఓ మెడికల్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు కార్యాలయ సూపరింటెండెంట్‌పైనా కేసు నమోదయ్యిందన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ఇద్దరినీ పోలీసులు బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. తాము ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని చెబుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశం

కామారెడ్డి క్రైం: ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ధాన్యం కొనుగోళ్లపై జిల్లా పౌరసరఫరాలు, సహకార శాఖల అధికారులు, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిలువలు లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలన్నారు. రైస్‌మిల్ యజమానులు వెంటవెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించాలని, రవాణా కోసం లారీల సంఖ్య పెంచాలని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లికార్జున బాబు, ఇన్‌చార్జి డీఎం నిత్యానందం, సహకార శాఖ అధికారులు, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న చైర్మన్‌లు

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

కామారెడ్డి క్రైం: కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని పలువురు సింగిల్ విండో చైర్మన్ కోరారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కొనుగోలు కేంద్రాలలో వేల సంఖ్యలో బస్తాలు తూకం పూర్తి చేసుకుని మిల్లులకు తరలించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. లారీలు సకాలంలో రాకపోవడంతో ఇబ్బంది ఎదురవుతోందని పేర్కొన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే లారీలను తెప్పించి, ధాన్యాన్ని తరలించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్‌లు నల్లవెల్లి అశోక్, తిరుపతి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

ఆలయ మాన్యాలను పరిరక్షించాలి

నిజామాబాద్ రూరల్: ఆలయ మాన్యాలను పరిరక్షించాలని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ సూచించారు. భూములను ఫొటోలు తీయించి, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఆలయ అర్చకులకు సూచించారు. మాధవనగర్ సాయిబాబా ఆలయంలో బుధవారం కోటగిరి, వర్ని, రుద్రూర్, ఇందల్వాయి, మాక్లూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, నందిపేట్, మోస్రా, నందిపేట్ మండలలోని గ్రామాలకు చెందిన పూజారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ధూపదీప నైవేద్య పథకం ద్వారా ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు గుర్తింపు కార్డులు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సెక్షన్ 43 ప్రకారం ఆయా ఆలయాలను రిజిస్ట్రేషన్, పబ్లికేషన్ చేయించుకోవాలని సూచించారు.



అర్చకులకు గుర్తింపు కార్డులు ఇస్తున్న సుప్రియ



పెద్దకొడప్‌గల్‌లో వర్షానికి కొట్టుకుపోయిన జొన్నలను ఎత్తుతున్న రైతులు

భారీ వర్షం.. తడిసిన ధాన్యం

నిజాంసాగర్/పెద్దకొడప్‌గల్: నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, పెద్దకొడప్‌గల్ మండలాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. పెద్దకొడప్‌గల్ మండలంలోని కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన జొన్నలు వర్షానికి కొట్టుకుపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో తూకం చేసిన వడ్ల బస్తాలు కూడా తడిసిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



మహమ్మద్‌నగర్‌లోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు

మద్యం వ్యాపారుల సిండికేట్ దందా

- కొరత పేరిట వైన్‌షాప్‌లలో నోస్టాక్ బోర్డులు
- ధరలు పెంచేసి ఇష్టారాజ్యంగా విక్రయాలు
- లాభం ఎక్కువగా వచ్చే బీర్ల అమ్మకానికి ప్రాధాన్యత
- మద్యంప్రియుల జేబులకు చిల్లు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు



కామారెడ్డిలోని ఓ వైన్‌షాప్‌లో నో స్టాక్ బోర్డు

కామారెడ్డి క్రైం: ఓవైపు వేసవి తాపం, మరోవైపు ఎన్నికల హడావుడితో మద్యం దుకాణాలు, బార్‌లకు గిరాకీ పెరిగింది. ఇదే అదనుగా మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి, నో స్టాక్ బోర్డులు పెట్టేశారు. మద్యం ప్రియులు ఎక్కువగా ఇష్టపడే కంపెనీలవి కాకుండా ఎక్కువ లాభం వచ్చే కంపెనీల బీర్‌లను దొడ్డిదారిన విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కమీషన్‌లు ఎక్కువగా ఇచ్చే కంపెనీలకు చెందిన మద్యం బాటిళ్లు మాత్రమే చాలావరకు వైన్‌షాప్‌లు, బార్‌లలో దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు కొన్ని బార్‌లు బీర్ ధరలు అమాంతం పెంచేశాయి. దీంతో బీరుప్రియుల జేబుకు చిల్లు మరింత పెరిగింది. అప్పటికీ కోరుకున్న బ్రాండ్ బీరు దొరక్క తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నా ఎక్సైజ్ శాఖ చోద్యం చూస్తూ కూర్చుందనే విమర్శలున్నాయి.

అమ్మిందే తాగాలి..

కొద్దిరోజుల క్రితం మంచిర్యాల జిల్లాలో ఓ యువకుడు కింగ్‌ఫిషర్ కంపెనీకి చెందిన బీర్లు విక్రయించడం లేదని అక్కడి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఎవరూ ఫిర్యాదు వరకు వెళ్లకపోయినా కామారెడ్డి జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. సాధారణంగా కింగ్ ఫిషర్ కంపెనీకి చెందిన బీర్‌లనే యువత ఎక్కువగా ఇష్టపడతారు. కానీ వైన్‌షాప్‌లు, బార్‌లలో ఈ బ్రాండ్ బీర్లను అందుబాటులో ఉంచడం లేదు. చాలావరకు మద్యం దుకాణాలలో బీర్‌లకు నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నారు. దీంతో వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే బీర్ తయారీ కంపెనీలు ఉత్పత్తిని తగ్గించాయని, గోదాం నుంచి తక్కువ స్టాక్ ఇస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. ఇదే సమయంలో జనం ఇష్టపడని కంపెనీల బీర్‌లను అంటకడుతున్నారు. కింగ్ ఫిషర్ కంపెనీ బీర్లు దొరక్క యువత బేజారవుతోంది.

అడ్డదారుల్లో ..

వైన్‌షాప్‌లకంటే బార్‌లలో చార్జీల పేరిట గతంలో ఒక్కో బీర్ బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేసేవారు. ప్రస్తుతం కొరత సాకుతో ఎమ్మార్పీపై రూ.30 నుంచి రూ. 50 వరకు అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా మద్యం దుకాణాలకు వచ్చే బీర్‌లను అదే దుకాణంలో విక్రయించాలి. కామారెడ్డిలో కొందరు వ్యాపారులకు బార్‌లతో పాటు వైన్‌షాప్‌లు కూడా ఉన్నాయి. వైన్‌షాప్‌లకు వచ్చే సరుకును అక్కడి నుంచి గుట్టుగా బార్‌లకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. బార్‌లలో అధిక ధరకు విక్రయించి అదనపు సొమ్ము సంపాదించవచ్చని ఇలా చేస్తున్నారు. అంతేకాకుండా బార్‌లలోని మద్యం బాటిళ్లను బయటకు విక్రయించకూడదు. కానీ కామారెడ్డిలో బార్‌లనుంచి యథేచ్ఛగా బయటికి ఇస్తున్నారు. అలాగే రాత్రి 10 గంటల తర్వాత కూడా బార్‌లనుంచి ఇష్టారాజ్యంగా విక్రయాలు జరుగుతున్నాయి. అయినా ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

కొరత ఉన్నది వాస్తవమే

పెద్ద కంపెనీల నుంచి సరుకు తక్కువగా రావడం, వేసవిలో బీర్‌లకు డిమాండ్ పెరగడంతో కొరత ఉన్నది వాస్తవమే. వచ్చిన స్టాక్‌ను అన్ని దుకాణాలకు సమానంగా పంచుతున్నాం. డిమాండ్ ఉన్న బీర్‌ల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టి తీసుకువెళ్లాం. బార్‌ల నుంచి మద్యాన్ని బయటకు అమ్మకూడదు. నిబంధనలను ఎవరు అతిక్రమించినా చర్యలు తీసుకుంటాం.

– విక్రం కుమార్, ఎక్సైజ్ ఎస్సై, కామారెడ్డి

రోడ్డెక్కిన అన్నదాత

- ధాన్యం కొనుగోలు చేయాలంటూ రాస్తారోకో
- గంటన్నర పాటు స్తంభించిన ట్రాఫిక్



కోమలంచ గేటు వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, పోలీసులు

నిజాంసాగర్: ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు రోడ్డెక్కారు. బుధవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంతో పాటు కోమలంచ గేటు వద్ద రాస్తారోకో చేశారు. బాన్సువాడ- ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రెండు చోట్ల రైతులు సుమారు గంటన్నర పాటు రాస్తారోకో చేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వారం రోజులుగా ధాన్యం తూకం వేయడం లేదని ఆరోపించారు. ధాన్యం బస్తాల తరలింపునకు లారీలు రావడం లేదని, దీంతో కొనుగోలు కేంద్రంలో నిల్వలు పేరుకుపోతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు కడ్తా పేరిట రైస్‌మిల్లర్లు తమను దోచుకుంటున్నారని ఆరోపించారు. రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలని, ధాన్యం బస్తాల తరలింపునకు లారీలు పంపాలని, ధాన్యం తూకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ, స్థానిక ఎస్సై సుధాకర్ రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. విషయాన్ని ఫోన్ ద్వారా జిల్లా సివిల్ సప్లై అధికారి, బాన్సువాడ ఆర్డీవోల దృష్టికి తీసుకువెళ్లారు. ధాన్యం కొనుగోలు చేస్తామని, బస్తాల తరలింపునకు కావాల్సిన లారీలు పంపిస్తామని పేర్కొన్నారు. మహమ్మద్‌నగర్ తహసీల్దార్ క్రాంతి కుమార్ రైతుల వద్దకు వచ్చి, తాను దగ్గరుండి తూకం వేయిస్తానని, లారీల్లో ధాన్యం బస్తాలను తరలించేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. రాస్తారోకోలో రైతులతోపాటు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు సాదుల సత్యనారాయణ, గంగారెడ్డి, విఠల్‌గౌడ్, రవి గౌడ్, పోలీస్ రాజు, మిడుత సాయిలు, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ముట్టడి..

ధాన్యం కొనుగోలు చేయాలంటూ మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో ఉన్న గున్కుల్ సొసైటీని గున్కుల్ రైతులు, బీజేపీ నాయకులు ముట్టడించారు. రైతులు, బీజేపీ నాయకులు సొసైటీని ముట్టడించడంతో సిబ్బంది తమ కార్యాలయానికి తాళం వేసుకొని బయటకు వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన రైతులు, బీజేపీ నాయకులు సొసైటీ వద్ద కొంతసేపు ఆందోళన చేశారు. అనంతరం మహమ్మద్‌నగర్ బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.



మహమ్మద్‌నగర్‌లో రాస్తారోకో చేపట్టిన రైతులు

18న ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్‌పై అవిశ్వాసం

- ప్రత్యేక సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- క్యాంపులో 11 మంది కౌన్సిలర్లు

సాక్షి, కామారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. ఈనెల 18న ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో చైర్మన్‌తో కలిపి 12 మంది కౌన్సిలర్లున్నారు. మొన్నటి వరకు బీఆర్‌ఎస్‌లో ఉన్న చైర్మన్ కుడుముల సత్యనారాయణ లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఆయన కాంగ్రెస్‌లో చేరిన రోజే అంటే గతనెల 24న 11 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాసం నోటీస్ అందించారు. దీంతో ఎల్లారెడ్డి మున్సిపల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అవిశ్వాసం నోటీస్ ఇచ్చిన కౌన్సిలర్లంతా క్యాంపునకు తరలారు. ఏడాది కాలంగా మున్సిపల్ చైర్మన్‌పై కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. అప్పట్లోనే అవిశ్వాసం పెట్టేందుకు రెడీ అయి క్యాంపునకు వెళ్లారు. అయితే పార్టీ నాయకులు కౌన్సిలర్లను సముదాయించి అవిశ్వాసం ఆలోచనను విరమింపజేశారు. ఇటీవల చైర్మన్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో కౌన్సిలర్లు మరోసారి అవిశ్వాసానికి ప్రయత్నించారు. అవిశ్వాసం నోటీసు ఇచ్చిన తరువాత 11 మంది క్యాంపునకు తరలివెళ్లారు. క్యాంపులో ఉన్న కౌన్సిలర్లందరూ ఒక్కటిగా ఉన్నట్టు తెలుస్తోంది. వారంతా అవిశ్వాసం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి నేరుగా హాజరు కానున్నట్టు తెలుస్తోంది.



ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయం

క్లుప్తంగా

17 నుంచి బ్యాక్‌లాగ్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని, హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు రూ.1000 అపరాధ రుసుంతో గురువారం వరకు ఇంటర్ బోర్డు అవకాశం కల్పించిందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: అగ్నిపథ్ స్కీం ద్వారా భారతీయ వాయుసేనలో అగ్నివీర్ వాయు(మ్యుజీషియన్స్) ఉద్యోగం కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి జూన్ 5వరకు https:// agnipathvayu. cdac. inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 02-01-2004 నుంచి 02-07-2007 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. పదో తరగతి పాసై ఉండాలని, సంగీతంలో ప్రావీణ్యం ఉండాలని వివరించారు.

ఎన్ఐటీలో 17వ ర్యాంక్


వైష్ణవి

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డికి చెందిన ముత్యాల వైష్ణవి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) జాతీయ స్థాయిలో 17వ ర్యాంకు సాధించినట్లు స్థానికులు తెలిపారు. పట్టణంలోని ముత్యాల లక్ష్మి-రామేశ్వర్‌రావు దంపతుల కూతురు వైష్ణవి ఎన్ఐటీ ఫ్యాషన్ టెక్నాలజీ నిర్వహించిన ఎంట్రెన్స్‌లో జాతీయ స్థాయిలో 17వ ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. ఆమెను కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు అభినందించారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు



బాన్సువాడ రూరల్: బాన్సువాడలోని మహేశ్వరి థియేటర్ ఆవరణలో గల కొబ్బరి చెట్టుపై మంగళవారం రాత్రి పిడుగు పడింది. దీంతో మంటలు వ్యాపించాయి. కొబ్బరి చెట్టు కొమ్మలు ఎండిపోయి ఉండటంతో చెట్టు ఆకులు కాలిపోయాయి. పెద్దశబ్దంతో పిడుగుపడి మంటలు చెలరేగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

హెచ్చరిక ప్రకటన

నా క్లయింట్ శ్రీ G మహేందర్ రెడ్డి తండ్రి లేటు కృష్ణారెడ్డి, R/o 3 స్టోన్ మౌంటైన్ కోర్ట్, స్కిల్‌మ్యాన్, న్యూజెర్సీ 08558, USA వారు టెలిఫోన్ ద్వారా తెలిపిన సూచనల మేరకు సాధారణ ప్రజలందరికీ ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ కామారెడ్డి జిల్లా, మహమ్మద్‌నగర్ మండలం, గాలిపూర్ గ్రామంలో గల సర్వే నం.16/1 (ఎ.01-03 గుంటలు), 16/2 (ఎ.02-00 గుంటలు), 151 (ఎ. 01-00 గుంటలు), 199 (ఎ.02-13 గుంటలు), 200 (ఎ.02-10 గుంటలు), 205/A (ఎ.00-37 గుంటలు), 210 (ఎ.01-00 గుంటలు), 211/1/1 (ఎ.00-33 గుంటలు), 222 (ఎ.02-15 గుంటలు), 224 (ఎ.01-18 గుంటలు) మరియు 232/2 (ఎ.0-33 గుంటలు), మొత్తం విస్తీర్ణం ఎ.16-02 గుంటల వ్యవసాయ భూములు ఉమ్మడి కుటుంబ ఆస్తి యొక్క యజమాని మరియు స్వాధీనదారు. అందువలన, శ్రీ G మధుసూదన్ రెడ్డి తండ్రి లేటు కృష్ణారెడ్డి మరియు శ్రీమతి G ప్రసూనా రెడ్డి భర్త శ్రీ G మధుసూదన్‌రెడ్డితో ఏవిధమైన అమ్మక వ్యవహారం కుదుర్చుకొనరాదని సాధారణ ప్రజలందరినీ నేను హెచ్చరిస్తున్నాను. ఈ నోటీసు ప్రచురణ తరువాత కూడా ఎవరైనా ఏవిధమైన అమ్మక వ్యవహారం కుదుర్చుకున్నా లేదా సంప్రదింపులు జరిపినా, ఈ ప్రచురణ తరువాత కూడా ఎవరైనా తదుపరిగా ముందుకుసాగినా వారు వారి స్వంత నష్టభూయిష్టపై చేసినట్లవుతుంది మరియు వాటి నుండి ఏర్పడే అన్ని వ్యయాలు, పర్యవసానాలకు బాధ్యులు అవుతారు.

సం/- K. సర్వోత్తమ్ రెడ్డి
అడ్వకేట్
16-2-146/C/2, పరిమళ హైట్స్, దయానంద్ నగర్, మలక్‌పేట్, హైదరాబాద్-500036.
మొబైల్ : 9959191234
తేది:15-05-2024

పదోన్నతులు లేక పరేషాన్

- భాషా పండితులు, పీఈటీలకు ప్రమోషన్లు కరువు
- సర్వీస్ రూల్స్ సవరణ చేస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం
- ఇప్పటికీ అమలుకు నోచుకోని వైనం


తడపాకల్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు(ఫైల్)

మోర్తాడ్: ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు లేకపోవడంతో పరేషాన్ అవుతున్నారు. స్కూల్ అసిస్టెంట్‌లతో సమానంగా పని చేస్తున్నా ఎస్‌జీటీ వేతనం పొందుతున్నామని భాషా పండితులు, పీఈటీలు వాపోతున్నారు. ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా, స్కూల్ అసిస్టెంట్‌లను గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యాశాఖలో చాలా కాలం తర్వాత పదోన్నతులకు అడుగులు ముందుకు పడటంతో ఉపాధ్యాయుల్లో సంతోషం వ్యక్తమైతుంది. తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులు, పీఈటీలకు మాత్రం పదోన్నతులకు అవకాశం లేకపోవడంతో వారు నిరుత్సాహానికి గురవుతున్నారు. జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో తెలుగు పండితులు 550 మంది, హిందీ పండితులు 450, ఉర్దూ బోధించేవారు 50 మంది, పీఈటీలు 600 మందికి పైగా పని చేస్తున్నారు. వీరికి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు(ఎస్‌జీటీ)గానే గుర్తింపు ఉంది. భాషా పండితులు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బోధిస్తున్నారు. పీఈటీలు కూడా పదో తరగతి విద్యార్థుల వరకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం అని సుప్రీం కోర్టు గతంలోనే వెల్లడించిందని.. తమకు మాత్రం పనికి తగిన వేతనం లభించడం లేదని భాషా పండితులు, పీఈటీలు వాపోతున్నారు. వీరికి పదోన్నతి కల్పించడానికి సర్వీస్ రూల్స్‌లో మార్పులు చేస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు.

గతంలో రెండుమార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ తమ సమస్యలపై స్పందించలేదని భాషా పండితులు, పీఈటీలు చెబుతున్నారు. 2018లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు భాషా పండితులు, పీఈటీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మాటా తప్పారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అధికారంలోకి రాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపి పదోన్నతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు. 2024-25 విద్యా సంవత్సరం పాఠశాలల పునః ప్రారంభానికి ముందుగానే తమ సమస్యకు పరిష్కారం చూపితే బాగుటుందని వేడుకుంటున్నారు.

న్యాయం చేయాలి



స్కూల్ అసిస్టెంట్‌లతో సమానంగా పని చేస్తూ ఎస్‌జీటీలుగా ఉండిపోతున్న అర్హులైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి లేదంటే మరో పోరాటం తప్పదు.

– శ్యాం, పీఈటీ, తిమ్మాపూర్

మా సమస్య పరిష్కరించాలి



ప్రపంచ తెలుగు మహాసభల సాక్షిగా భాషా పండితులు, పీఈటీలకు న్యాయం చేస్తామని అప్పట్లో కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇంత వరకు హామీని నెరవేర్చలేదు. ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి మా సమస్యపై దృష్టి సారించాలి. భాషా పండితులు, పీఈటీలు స్కూల్ అసిస్టెంట్‌లతో సమానంగా పని చేసినా ప్రయోజనం లేకుండా పోతుంది.

– ప్రవీణ్ శర్మ, తెలుగు పండిత్, తడపాకల్

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన జేఏవో!


కోడ్ అమలులో ఉండగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జేఏవో గంగాధర్

నిజామాబాద్ నాగారం: విద్యుత్ శాఖలో జూనియర్ అకౌంట్ ఆఫీసర్(జేఏవో)గా విధులు నిర్వహిస్తున్న 327 యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పూదరి గంగాధర్(జేఏఓ) ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. కోడ్ అమలు ఉండగా జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ ఐటీఐ కళాశాల ఆవరణలో ఉదయం వాకింగ్ సమయంలో ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించారు. దీనిపై సీ విజిల్ యాప్‌లో ఏప్రిల్ 3న ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు విచారణ చేసి నివేదిక అందజేయాలని ఎస్ఈ రవీందర్‌ను ఆదేశించారు. విద్యుత్‌శాఖ సీఎండీ కార్యాలయం నుంచి సైతం ఏపీటీఎస్ సీఐ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేయాలని ఆదేశాలు వచ్చాయి. అధికారులు వేర్వేరుగా విచారణ చేపట్టారు. ఈ నెల 9న విచారణ చేసి, 12న నివేదికలను కలెక్టర్‌కు అందజేశారు. కాగా గంగాధర్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అధికారుల చర్యల నుంచి తప్పించుకోవడానికి సదరు ఉద్యోగి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వాకర్స్ అసోసియేషన్ నుంచి సదరు ఉద్యోగికి ఎలాంటి సంబంధం లేదని విన్నవించినట్లు తెలిసింది. వాకింగ్‌కు వెళ్లడంతోనే అందరితో పాటు కలిశామని చెబుతున్నారు.

నివేదిక అందించాం

జేఏవో గంగాధర్ ఐటీఐ కళాశాల మైదానంలో అభ్యర్థి జీవన్‌రెడ్డిని కలిసిన విషయమై సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు వెళ్లింది. కలెక్టర్, సీఎండీ ఆదేశాల మేరకు విచారణ చేసి ఇప్పటికే నివేదిక అందించాం. కోడ్ అమలులో ఉండగా ఎప్పుడు కూడా రాజకీయ నాయకులను కలువకూడదు.

– రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ

డెంగీ నివారణకు కదులుదాం

నిజామాబాద్‌నాగారం: డెంగీతో ఎంతో మంది మంచాన పడుతున్నారు.. మరికొంతమంది భయంతో చనిపోతున్నారు. జిల్లాలో డెంగీ కేసులు జనవరి నుంచి ఇప్పటి వరకు 115 నమోదయ్యాయి. గతేడాది 356 కేసులు నమోదయ్యాయి. ప్రాణాంతకమైన ఈ వ్యాధి నివారణకు జాగ్రత్తలు అవసరం. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా కథనం..

వ్యాధి లక్షణాలు

- డెంగీ వ్యాధి ఎడిస్ దోమ కుట్టడంతో వ్యాప్తి చెందుతుంది.
- తీవ్రమైన జ్వరం రావడం, తలనొప్పి, కండరాలు, కీళ్లనొప్పులు వస్తాయి.
- కళ్ల వెనుక భాగంలో తీవ్రమైన నొప్పి, ఆకలి మందగించడం, శరీరంపై దద్దుర్లు రావడం, వికారం, వాంతులు.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో 'ఎలీసా' పద్ధతిలో జరిపే రక్త పరీక్ష ద్వారా డెంగీ వ్యాధిని నిర్ధారించవచ్చు.
- ఏడిస్ దోమలు ఎక్కువగా పగలు కుడతాయి. ఈ దోమలు ఇంటి పరిసరాలలో నిల్వ ఉన్న నీటిలో పెరుగుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయాలి.
- ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపులు, డ్రమ్ములు, నీటి తొట్ల మీద మూతలు పెట్టాలి.
- ఇళ్లలోకి దోమలు రాకుండా చర్యలు తీసుకోవాలి.
- ప్రభుత్వం డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

నేడు అవగాహన ర్యాలీ

జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించడానికి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నాం. దోమల నివారణకు ప్రతి శుక్రవాం డ్రైడేగా పాటిస్తున్నాం.

– తుకారాం రాథోడ్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

ఉచిత సేవలు ఉత్తవేనా?



- పెట్రోల్ బంకుల్లో కానరాని సేవలు
- పట్టించుకోని అధికారులు


బాన్సువాడలోని ఓ బంక్‌లో పని చేయని గాలి నింపే యంత్రం

బాన్సువాడ: బాన్సువాడకు చెందిన శ్రీనివాస్ తాడ్కోల్ రోడ్డులో ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లు పెట్రోల్ పోయించుకునేందుకు వెళ్లాడు. పెట్రోల్ పోయించుకుని బైక్ టైర్లలో గాలి చెక్ చేయాలని అక్కడి సిబ్బందిని అడగ్గా.. ఇక్కడ మిషన్ పనిచేయడం లేదని సమాధానం చెప్పారు. తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు మెకానిక్ వద్ద డబ్బులు చెల్లించి టైర్లలో గాలి నింపుకుని వెళ్లాడు. ఇలా చాలా పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. వేసవి దృష్ట్యా బంకుల్లో నీరు తాగుదామంటే తాగునీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు ఎక్కడ కనిపించడం లేదు. బంకుల్లో టైర్లలో గాలి నింపడం, తాగునీరు, మూత్రశాలలు తదితర సేవలు ఉచితంగా కల్పించాలి. వీటిపై అవగాహన లేకపోవడంతో డబ్బులు వసూలు చేస్తున్నారు. అసలే పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే అదనపు వ్యయం భారంగా మారుతోంది. ప్రతీ బంకులో టాయిలెట్, మంచి నీరు, ఎయిర్ ఫ్రీగా అందించాలి. ఇలా అందిస్తేనే బంకు నిర్వహణకు అనుమతి దొరుకుంది. మనం పెట్రోల్, డీజిల్ కోసం చెల్లించే డబ్బులో వీటి మెయింటెన్స్ కోసం కూడా వసూలు చేస్తారు. కానీ వసతులు మాత్రం కల్పించడం లేదు. ఏ బంకుల్లోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయొచ్చు. స్వచ్ఛభారత్‌లో భాగంగా అన్ని పెట్రోల్ బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉంచాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అత్యవసర పరిస్థితుల్లో చరవాణి వినియోగించుకునే సదుపాయం పంపుల్లో ఉండాల్సిందే. ప్రతీ బంకులో ఫిర్యాదు పెట్టె లేదా రిజిస్టర్ అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రథమ చికిత్స కిట్ ఉంచాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోంచుకునే వీలుంది. కానీ ఈ సౌకర్యాలు ఏ ఒక్క బంకులో పూర్తి స్థాయిలో కనిపించడం లేదు. సంబంధిత అధికారులు తనిఖీలు చేసిన దాఖలలు లేవు. దీంతో బంకు నిర్వాహకులు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి బంకుల్లో వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అప్‌గ్రేడ్ చేసినా పాత వేతనమే..

- మినీ అంగన్‌వాడీ టీచర్లకు పాత వేతనం జమ


దొన్కల్ వడ్డెర కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం

మోర్తాడ్: మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేసినా పాత వేతనం జమ చేయడంతో ఉద్యోగులు ఖంగుతిన్నారు. మినీ అంగన్‌వాడీలను జనవరిలో అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. అప్‌గ్రేడ్ చేయడంతో అంగన్‌వాడీ కార్యకర్తల వేతనం రూ.7,500 నుంచి రూ.15వేలకు పెరిగింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో కొత్త వేతనం ప్రకారం నిధులను విడుదల చేశారు. ఈనెలలో చెల్లించిన వేతనం విషయంలో మాత్రం పాత పద్ధతి ప్రకారం ఒక్కొక్కరికి రూ.7,500 చొప్పున వేతనం జమ చేశారు. అప్‌గ్రేడ్ చేసిన తర్వాత పాత వేతనం ఎందుకు చెల్లించారో అర్థం కాక అంగన్‌వాడీ కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు లేక పోవడంతో కార్యకర్తలకు ఈసారి వేసవి సెలవులను ప్రకటించలేదు. ఈ కారణంగా కార్యకర్తలే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆహారం వండిపెడుతున్నారు. రెండు నెలల పాటు కొత్త వేతనం చెల్లించి ఈ నెలకు వచ్చేసరికి పాత వేతనం ఎందుకు చెల్లించారో అర్థం కావడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు. జిల్లాలో అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 135 వరకు ఉన్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం

అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు పాత వేతనం చెల్లించడంపై ఉన్నతాధికారులకు నివేదించాం. ఎన్నికల కోడ్ కారణంగా నిధుల విడుదలలో జాప్యం జరిగి పాత వేతనం జమ చేశారు. ఎవరు ఆందోళన చెందవద్దు. త్వరలోనే నిధులు విడుదల చేస్తారు. పూర్తి స్థాయి వేతనం మళ్లీ జమ అవుతుంది.

– రసూల్‌బీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి

జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్ల మధ్య గొడవ

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

నిజామాబాద్ నాగారం: నగరంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యుల మధ్య పది రోజుల క్రితం గొడవ జరగ్గా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూనియర్ డాక్టర్లు, బయట వ్యక్తుల మధ్య జరిగిన గొడవకు సంబంధించిన వీడియోలు వైరలయ్యాయి. జూనియర్ వైద్యుల మధ్య గొడవ జరగ్గా.. దీనిలోకి ప్రైవేట్ వ్యక్తులు వచ్చారు. దీంతో గంటపాటు వాగ్వాదం చోటు చేసుకుంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, నర్సులు ఆపే ప్రయత్నం చేసినా వాళ్లు వినలేదు. గొడవలో మహిళా జూనియర్ డాక్టర్లు కూడా ఉండడం గమనార్హం. ప్రైవేట్ వ్యక్తులతో ఉన్న సాన్నిహిత్యంతో గొడవ జరిగినట్లు సమాచారం. అధికారుల పర్యవేక్షణ లేకనే జీజీహెచ్‌లో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆటో, బైక్ ఢీ : ఒకరికి గాయాలు

రెంజల్: మండలంలోని కిసాన్‌తండా వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన రొడ్డ సాయికుమార్ ద్విచక్ర వాహనంపై నవీపేట్ నుంచి కూనేపల్లి గ్రామానికి వస్తుండగా కూనేపల్లి నుంచి నవీపేట్‌కు వెళ్తున్న ఆటో ఢీకొంది. ప్రమాదంలో సాయికుమార్‌కు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కారు ఢీకొని ఒకరికి..

మోపాల్: మండలంలోని మంచిప్ప శివారులో గల గండి మైసమ్మ దేవాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగంపల్లికి చెందిన రషీద్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రషీద్ గ్రామాలు తిరుగుతూ పాత సామగ్రిని సేకరిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో బుధవారం శ్రీరాం నగర్ తండాలో తిరిగి మంచిప్ప రోడ్డు పైకి వస్తుండగా గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో రషీద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు.రషీద్ బావ షేక్ గౌస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి


పండరి మృతదేహం

పిట్లం: మండలంలో పిట్లం-బాన్సువాడ రహదారిపై పోతిరెడ్డిపల్లి రూమ్ తండా వద్ద మంగళవారం రాత్రి ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నిజాంసాగర్ మండలం నర్సింగరావుపల్లి గ్రామానికి చెందిన పండరి(30) పిట్లం మండలంలోని రాంపూర్ గ్రామంలో తన అత్తగారింటికి వచ్చాడు. బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా పోతిరెడ్డిపల్లి రూమ్‌తండా వద్ద రోడ్డుపై నిలిపి ఉంచిన బైక్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో పండరి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గంగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

గాంధారి ఎక్స్ రోడ్డు వద్ద మరొకరు..

రామారెడ్డి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి గాంధారి ఎక్స్‌రోడ్డు వద్ద చోటు చేసుకుంది. సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామానికి చెందిన దేమె రాజయ్య(46) పద్మాజీవాడికి వెళ్లి బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గాంధారి ఎక్స్ రోడ్డు దగ్గర ప్రమాదం జరిగింది. రాజయ్య పైనుంచి ఐచర్ వాహనం వెళ్లడంతో శరీరం రెండు ముక్కలు అయింది.

బైక్ ఢీకొని..


బాలయ్య (ఫైల్)

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని సిరిసిల్ల రోడ్డు జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన జనపాల బాలయ్య (40) బైక్‌పై కామారెడ్డికి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలయ్య తలకు తీవ్ర గాయాలు కాగా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో చనిపోయాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

కరెంట్‌షాక్‌తో రైతు..


చిన్నయ్య (ఫైల్)

మాక్లూర్: కరెంట్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని కల్లెడిలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్సై గంగాధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉమ్మెడ చిన్నయ్య(48) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం కురిసిన గాలివానకు ఆయన పొలంలోని బోరుబావి స్టార్టర్ డబ్బా చిందరవందరగా పడిపోయింది. బుధవారం దానిని సరి చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి చిన్నయ్య చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

నందిపేట్: మండలంలోని సీహెచ్ కొండూర్ ఎత్తిపోతల పథకం మొదటి పంప్‌హౌస్ వద్ద గల సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. వర్షాకాలం రానున్న నేపథ్యంలో ఎత్తిపోతల కమిటీ సభ్యులు పంపుహౌజ్‌లోని మోటార్లను పరిశీలించేందుకు మొదటి పంపుహౌజ్ వద్దకు వెళ్లారు. పక్కనే గల సబ్‌స్టేషన్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వ్యర్థ సామగ్రి పడడంతో అనుమానం వచ్చి చూడగా ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర వైరు, ఆయిల్ గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గమనించారు. సబ్‌స్టేషన్ బయట కాపర్ వైరు ఉండే సామగ్రి పడేశారు. తల్వేద ఎత్తిపోతల కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై రాహుల్‌ను సంప్రదించగాస్పందించలేదు.

బోధన్‌లో మృతదేహం లభ్యం

బోధన్‌టౌన్: బోధన్ శివారులోని బాబా గార్డెన్ సమీపంలో మంగళవారం రాత్రి మృతదేహం లభించిందని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. వివరాలు.. బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన శంకర్(45) ఈ నెల 8న ఇంట్లో నుంచి వెళ్లాడు. మంగళవారం రాత్రి పట్టణ శివారులో కుళ్లిన స్థితిలో శంకర్ మృతదేహం లభించింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. శంకర్ ఫిట్స్ వచ్చి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. శంకర్ కొద్దిరోజుల క్రితం బాబా గార్డెన్ వద్దగల హోటల్‌లో పనిచేశాడని చెప్పారు. మృతుడికి భార్య అమిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నిజామాబాద్‌రూరల్: మండలంలోని తిర్మన్‌పల్లి హైస్కూల్ 2005-06 బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

భార్యపై దాడి చేసిన భర్తపై కేసు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డికి చెందిన ఉబ్బి పూజితపై దాడి చేసిన ఆమె భర్త సాయిబాబాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. వివరాలు.. ఈ నెల 2న పూజిత, సాయిబాబా మధ్య గొడవ జరిగింది. దీంతో సాయిబాబా తన భార్య పూజితపై పైపుతో దాడి చేసి గాయపర్చాడు. పూజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి వద్ద పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, దేవునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న దాదాపు పది క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఆటో డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుతున్నట్లు పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



రాజంపేట:మండలంలోని షేర్‌శంకర్ తండాలో షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె కాలిపోయిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన ముద్రిచ్చ గణేశ్ గుడిసె మధ్యాహ్నం సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సుమారు రూ.2.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించినట్ల తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు.

కుల బహిష్కరణపై విచారణ

మోపాల్: మండల కేంద్రంలోని గోపు మహేశ్‌ను కుల బహిష్కరణ చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై గంగాధర్ బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. బాధితుడు మహేశ్ మాట్లాడుతూ.. సుమారు 25 ఏళ్ల క్రితం తాను అరి సందు(ఖాళీ స్థలం) వదిలి ఇళ్లు కట్టుకున్నానని చెప్పారు. ఇంటి వెనకాల గల మున్నూరుకాపు సంఘానికి ప్రహరీ నిర్మించేందుకు కుల పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. తాను వదిలిన స్థలంలో (అరి సందు) తన గోడకు ఆనుకుని ప్రహరీ నిర్మిస్తామనడంతో అడ్డు చెప్పినట్లు తెలిపాడు. వారు చెప్పినట్లు వినడం లేదని సంఘం పెద్దలు కుల బహిష్కరణ చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన తన తండ్రి గంగాధర్ మే 6న మృతి చెందాడన్నారు. ఈ విషయం కులం పెద్ద మనుషులకు సమాచారమిచ్చినా.. అంత్యక్రియలకు హాజరు కాలేదన్నారు. తన అక్కను గ్రామానికి చెందిన లచ్చన్నకు ఇచ్చి వివాహం చేశామని, వారిని కూడా అంత్యక్రియలకు రాకుండా అడ్డుకున్నారని మహేశ్ చెప్పాడు. రూ.50వేలు జరిమానా విధిస్తామని బెదిరించడంతో అక్క మాత్రమే అంత్యక్రియలకు వచ్చిందన్నారు. తనను కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ WE are READY TO INVEST TO DEVELOP YOUR BUSINESS. we also Welcome Agents. Good Salary & Commission. Cont: 9092692403. [IA-017]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502815217. [M-1185076]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18K ఫోన్: 9160900024 / 9640400073. [H-799880]

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ ఆఫీస్ అసిస్టెంట్స్, నర్సులు, లేడీ కేర్ టేకర్స్, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-14041]

■ విజయవాడలో పెద్దవారిని/బెడ్ పేషెంట్‌లని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F ఆయాలు, నర్సులు కావలెను. వసతి + భోజనం + మంచి జీతం. ✆ 91608 35559, 98850 25559. [B-052]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి తగిన పెదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.